
పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1988-89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

మూడు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయిక

ఎల్బీనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల తర్వాత అపూర్వ కలయికతో వారంతా ఆడుతూ పాడుతూ ఆహ్లాదంగా గడిపారు. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించి డిండిలోని మొదటి పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసిన విద్యార్థులు లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఎస్ విలేజ్ కన్వెన్షన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఒకరినొకరు జోకులు వేసుకుని నృత్యాలు చేస్తూ నాటి ఆటపాటలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎలకుర్తి మల్లేష్, వీరబొమ్మ రామ్మోహన్, క్రాంతికుమార్, బిక్కుమాండ్ల పరమేశ్వర్, అలంపల్లి శ్రీనివాస్, కాసం శ్రీను, మన్సూర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, రమేష్, సుల్తాన్, ముజాహిద్‌ఖాన్, నారయ్య, బాలయ్య, పద్మరేఖ, అనురాధ, ఉమాదేవి, అరుణజ్యోతి, వియలక్ష్మి, రాణమ్మ పాల్గొన్నారు.


పాదయాత్రలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కాలనీలో సోమవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.


ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్‌ఐ మారయ్యను సన్మానిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు

సెక్టార్ ఎస్‌ఐ మారయ్యకు సన్మానం

చంపాపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ సెక్టార్ ఎస్‌ఐగా నియమితులైన మారయ్య, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేగోని మల్లేష్‌గౌడ్, బొంబాయి, బండారు సత్తిరెడ్డి, గోగు శేఖర్‌రెడ్డి, గౌరీదేవిరాజు, అశోక్‌గౌడ్, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్వరూపానందేంద్ర సరస్వతికి పాదపూజ

చందానగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి సోమవారం చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో పాదపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీగణపతిస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. చాతుర్మాస్య దీక్షలో ఉన్న స్వరూపానందేంద్రకు పలువురు పాదపూజ చేశారు. కార్యక్రమంలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, ఆలయ ఫౌండర్ చైర్మన్ రమణమూర్తి, ఆలయ సేవా దళం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గండిచెరువులో

అక్రమంగా మట్టి తవ్వకాలు


గండిచెరువులో అక్రమంగా మట్టిని తవ్వుతున్న దృశ్యం

- రాత్రి ప్రభుత్వ.. పగలు పట్టా భూముల్లో..
- ప్రభుత్వానికి రూ. కోట్ల ఆదాయం గండి
- అయినా పట్టించుకోని మైనింగ్ అధికారులు
- క్వారీలను తలపిస్తున్న భూములు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ రెవెన్యూ గండిచెరు గ్రామంలోని ప్రభుత్వ భూమితో పాటు పట్టా భూముల్లో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతుంది. రాత్రి ప్రభుత్వ భూమి, పగలు పట్టా భూముల్లో ఇక్కడ పెద్ద ఎత్తున అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిసింది. మట్టి తవ్వకాలకు ప్రభుత్వం, మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే విచ్చలవిడిగా మైనింగ్ వ్యాపారం సాగుతుంది. తద్వారా ప్రభుత్వంతో పాటు మైనింగ్‌శాఖ కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతుంది. మట్టి మాఫియా మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కోట్ల రూపాయలను తమ ఖాతాలో వేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న వాహనాలు

పట్టా భూముల్లో మైనింగ్‌శాఖ నుంచి 10 నుంచి 20 రోజులకు తాత్కాలిక అనుమతులు పొందిన నిబంధనలను పాతరేస్తూ అక్రమ మైనింగ్‌ను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

రాత్రి, పగలు తేడా లేకుండా..

గండిచెరువు గ్రామంలోని ప్రభుత్వ సర్వే నంబర్ 255తో పాటు సమీపంలోని పట్టా భూముల్లో మట్టి మైనింగ్ వ్యాపారం జరుగుతుంది. మైనింగ్ నిబంధనలు తుంగలోతొక్కుతూ ఇష్టారీతిన మట్టిని తోడేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పదుల సంఖ్యల్లో టిప్పర్ లారీలలో మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయా భూముల్లో ఇప్పటికే కోట్ల రూపాయల విలువైన మట్టిని తవ్వేశారు. కొంత కాలంగా ఓ ముఠా మాఫియాగా ఏర్పడి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ స్థానికులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. పర్యావరణం దెబ్బతినేలా పదుల మీటర్ల లోతులో లక్షల ట్రిప్పుల మట్టిని తోడేశారు. దీంతో ఆ ప్రాంతమంతా లోతైన బావులను తలపిస్తుంది. మట్టికి డిమాండ్ పెరగడంతో ఇదే అదునుగా భావించిన మాఫియా ఒక్క ట్రిప్పు మట్టిని మార్కెట్‌లో రూ.5వేలకు అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా మట్టి మాఫియా మాత్రం కోట్ల రూపాయలను అర్జిస్తున్నట్లు తెలుస్తోంది.


మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ

2 వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులిచ్చాం

కొహెడ రెవెన్యూ గండిచెరువు గ్రామ పరిధిలోని పట్టా భూమిలో మట్టి మైనింగ్‌కు తాత్కాలిక అనుమతులు ఇచ్చాం. 20రోజులకు 2వేల క్యూబిక్ మీటర్ల మట్టి మైనింగ్‌కు అనుమతులు ఉన్నాయి. అంతకంటే ఎక్కువ మట్టిని తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
- నరసింహారెడ్డి, ఏడీ మైనింగ్

అధికారులకు కనిపించడం లేదా..?

అక్కడ పెద్ద ఎత్తున మట్టి మైనింగ్ జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. మైనింగ్ విషయంపై పలుమార్లు ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా శాఖల అధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యాపారం సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మట్టి మాఫియా పెద్దఎత్తున అధికారులకు అమ్యామ్యాలు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు ఈ విషయంలో తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన అధికారులే ఇలా మాఫియాకు అనుకూలంగా వ్యవహరించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు అక్రమ మట్టి మైనింగ్‌పై చర్యలు తీసుకుంటారా లేక వారికే అండగా ఉంటారా వేచి చూడాల్సిందే..

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చు

- ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఈడీ రాజశేఖర్

చాదర్‌ఘాట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ రాజశేఖర్ అన్నారు. సోమవారం ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ రీజియన్ పరిధిలోని డ్రైవర్లకు మూడు రోజుల ప్రమాద రహిత అవగాహన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు సురక్షితంగా బస్సులను నడపడం ద్వారా తమ ఇళ్లకు క్షేమంగా చేరడంతోపాటు ప్రయాణికులను కూడా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసిన వారవుతారన్నారు. ప్రతి ఒక్క డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలతో పాటు భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం మంచి అలవాట్లను అలవరచుకోవాలన్నారు. మద్యం సేవించి విధులకు హాజరు కావడం, వాహనాలను నడపడం ప్రమాదకర విషయమని గుర్తించాలన్నారు. సమయానుకూలంగా విశ్రాంతి తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యంతో పాటు విధులకు హాజరయ్యేందుకు అవకాశముందని ఆయన సూచించారు. మూడు రోజుల పాటు జరగనున్న డ్రైవర్ల శిక్షణ తరగతులకు మొదటి రోజైన సోమవారం 42మంది డ్రైవర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, డిప్యూటీ ఆర్ఎం(ఆపరేషన్) ఎస్.మాధవి, హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎం బాబునాయక్, దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ టి.సమత, ఎంఎఫ్ వెంకటేష్, అసిస్టెంట్ మేనేజర్ పావని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ రాజశేఖర్, పక్కన రీజినల్ మేనేజర్ సుధా పరిమళ తదితరులు

సీసీ రోడ్లను ప్రారంభించిన రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ధర్మపురికాలనీవాసులు ఎదుర్కొన్న కష్టాలను కాలనీవాసిగా తాను స్వీయానుభవంతో ఇక్కడి సమస్యలు పరిష్కరించానని కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ధర్మపురికాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను తాను కూడా అనుభవించానన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వరదనీటి సమస్యలు, గుంతలమయమైన రోడ్లు వంటి సమస్యలను కాలనీవాసులతో చర్చించి ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరిగిందన్నారు. కాలనీలో వంద శాతం రోడ్ల సమస్య, వరదనీటి సమస్య పరిష్కరించడం జరిగిందన్నారు. తనకు తోడ్పాటునందించిన కాలనీవాసులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీఎస్ రాజు, రామ, వీవీఎన్ మూర్తి, సూర్యనారాయణ, శంకర్, స్వర్ణలత, సురేష్, జగన్మోహన్‌రెడ్డి, శివ, నాగరాజు, సురేష్‌చారి, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, అమీర్, మహేష్ పాల్గొన్నారు.


ధర్మపురికాలనీలో కాలనీవాసులతో కలిసి సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

ఎల్బీనగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 23న చేపట్టనున్న విద్యాసంస్థ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ సరూర్‌నగర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాతరాజు భవాని, పి.వినోద్ కోరారు. సోమవారం వారు సరూర్‌నగర్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంస్థల్లోని సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలకు నూతన భవనాలను నిర్మించడంతో పాటు వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అమలు చేయాలన్నారు. 25శాతం ఉచిత విద్య అమలు చేయాలని వారు కోరారు. పూర్తిస్థాయిలో ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మేధావులు మద్దతునివ్వాలని వారు కోరారు.


సహారా ఎస్టేట్స్ కాలనీలో చేపట్టిన ఘటాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అమ్మవారి ప్రతిమను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు సునీల్‌రెడ్డి


మీర్‌పేట్‌లో తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మల్లేశ్‌ముదిరాజ్ తదితరులు


గడ్డిఅన్నారం బస్తీలో తొట్టెల ఊరేగింపులో మలక్‌పేట ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, మైత్రి కమిటీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, విక్కీగౌడ్


కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ వెంకటేశంగౌడ్

బీఆర్ఎస్‌లో చేరిన బీసీ సంఘాల జేఏసీ చైర్మన్

చంపాపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్‌కాలనీకి చెందిన కాంగ్రెస్ తెలంగాణ అధికార ప్రతినిధి, బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశంగౌడ్ సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వెంకటేశంగౌడ్‌కు కేటీఆర్ గులాబి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో బడుగు బలహీనవర్గాలకు ఎదుగుదలకు అవకాశం లేదని అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు సందడి

- పోతరాజుల విన్యాసాలు.. యువత నృత్యాలు
- ఘనంగా ముగిసిన బోనాల జాతర

సరూర్‌నగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు.. పోతరాజుల విన్యాసాలు, యువత నృత్యాల నడుమ ఆషాఢమాస బోనాల జాతర ఘనంగా ముగిసింది. ఆదివారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని గ్రామాలు, కాలనీల్లో బోనాల సంబురాలు జరుగగా.. సోమవారం ఊరేగింపుల సందడి కొనసాగింది. నాదర్‌గుల్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జిల్లెలగూడ, లెనిన్‌నగర్, బాలాపూర్‌చౌరస్తా, ప్రశాంతిహిల్స్, వినాయకహిల్స్, తిరుమలానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం తొట్టెలు, ఫలహారం బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. స్థానిక యువకులు కొందరు పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకోగా, ఇంకొందరు డప్పుచప్పులకు అనుగుణంగా నృత్యాలు చేశారు. తొట్టెలను ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు తీసుకువచ్చి అక్కడి చెట్లకు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఇక ఫలహారం బండితో వచ్చిన భక్తులు అమ్మవార్లకు సమర్పించారు. ఆయా ప్రాంతాల మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల ప్రతినిధులు, పలువురు నాయకులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


చంపాపేటలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్


ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయంలో ఘటాల ఊరేగింపు దృశ్యం

సైదాబాద్ : సైదాబాద్‌లో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. జానపద, భక్తి గేయాల హోరులో డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు, జానపద కళాప్రదర్శనలు, పోతురాజుల విన్యాసాలు, విచిత్ర వేషధారణల మధ్య ఊరేగింపు కొనసాగింది. శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళి జాతర ఉత్సవాలు 46సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘటాల ఊరేగింపు, గావుపెట్టె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భారతదేశ ప్రాచీన చరిత్రను, సంస్కృతికి అద్దంపట్టే విధంగా ప్రత్యేకంగా అలరించిన వాహనాలలో పౌరాణిక, సాంఘిక వేషధారణలు పలువురిని విశేషంగా ఆకర్షించాయి. ఊరేగింపు కార్యక్రమం మలక్‌పేట ఏసీపీ కార్యాలయం నుంచి ప్రారంభమై సైదాబాద్ వీధులలో తిరుగుతూ దోబీఘాట్ వద్ద గావుపెట్టె కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా సైదాబాద్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన వేదికలపై నుంచి పలువురు నాయకులు ఘటాలకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, అధ్యక్షుడు కె.మల్లేశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కడారి రాంకుమార్, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్ చందర్జీ, ఉపాధ్యక్షుడు సహదేవ్‌యాదవ్, కోశాధికారి గోలీకార్ పూర్ణచందర్, సంయుక్త కార్యదర్శులు జి. దినేష్, వినయ్, కె.సుభాష్, వినేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎల్.సాయిబాబా, అరవింద్, సంపత్, సాంస్కృతిక కార్యదర్శులు కోళ్ల గోపీ, ఆశిష్ గోలీకార్, పి. ఆనంద్ పాల్గొన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు..

అమ్మవారి ఘటాల ఊరేగింపు సందర్భంగా సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా మహిళా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా సైదాబాద్ చౌరస్తా నుంచి సింగరేణి కాలనీల మీదుగా వాహనాలను మళ్లించారు.

రెడ్డిబస్తీలో..

రెడ్డిబస్తీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపుకు బీజేపీ నేతలు మాధవీలత, చీకోటి ప్రవీణ్ హాజరయ్యారు. ఊరేగింపు నాగులమ్మ ఆలయం నుంచి ఏకలవ్యనగర్, మూడుగుళ్ల మీదుగా సాగింది.

ఎన్‌టీఆర్‌నగర్ ఫేజ్-3లో..

ఎల్బీనగర్ : ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ ఫేజ్-3లో కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షుడు చిన్నం నర్సింహ, చంద్రయ్య, ఐలయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారం బస్తీలో..

చాదర్‌ఘాట్ : బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి తొట్టెలు, ఘటాల ఊరేగింపు పోతరాజుల విన్యాసాల నడుమ సాగింది. గడ్డిఅన్నారం బస్తీలో గౌడ సంఘం నిర్వాహకులు విక్కీగౌడ్, గొట్టి పర్తి సాయిగౌడ్, ఎల్.శ్యాంగౌడ్, విజయ్, వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి తొట్టెల ఊరేగింపును మలక్‌పేట ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, మైత్రీ కమిటీ కన్వీనర్ లింగాల శ్రీనివాస్‌గౌడ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

చంపాపేట : చంపాపేటలో సింగంశెట్టి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఫలహారబండి ఊరేగింపును ప్రారంభించారు. పోతురాజుల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

ఓల్డ్‌మలక్‌పేట : ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయంలో ఘటాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసం అంగరంగవైభవంగా సాగింది. ఆలయ కమి టీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఘటం ఊరేగించారు. ఊరేగింపు అనంతరం ఘటం శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు.


ఘటాల ఊరేగింపు ప్రారంభోత్సవంలో శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు


ఊరేగింపులో పోతురాజుల చిందులు


డప్పు కళాకారుల విన్యాసాలు

సహారాఎస్టేట్స్ కాలనీలో..

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారాఎస్టేట్స్ కాలనీలో ఆదివారం రాత్రి ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఘటాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఘటాల ఊరేగింపులో భాగంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, కాలనీవాసులు, తదితర భక్తులు పాల్గొన్నారు.